



వరంగల్ అర్బన్ జిల్లా దేవనంపేట వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులు ● ఆలేరు మండలం కమ్మగూడెం వద్ద బైపాస్ నిర్మాణం ● ఆలేరు మండలం బహద్దూర్‌పేట వద్ద నిర్మాణంలో ఆర్‌యూబీ

# విస్తరణకు వడివడిగా..

- **రాష్ట్రంలో 2,915 కి.మీ. జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం అనుమతి**
- **భూసేకరణే కీలకం**
- **నూతన చట్టం ప్రకారం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు**

ఈనాడు, హైదరాబాద్: జాతీయ రహదారుల విస్తరణలో తెలంగాణ వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల తర్వాత రహదారుల విస్తరణకే ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత మూడేళ్లలో సుమారు రూ.10 వేల కోట్ల వరకు నిధులు కేటాయించింది. దీనికితోడు కేంద్రం భారీ ఎత్తున జాతీయ రహదారులను ప్రకటిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో ఎంత విస్తీర్ణంలో జాతీయ రహదారులున్నాయో అంతకు మించి జాతీయ రహదారులను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన ప్రతి మార్గానికి కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు.

కేంద్రం ప్రకటించిన 2,915 కిలోమీటర్ల జాతీయ రహదారుల విస్తరణను మూడేళ్లల్లో పూర్తి చేయాలన్నది తెలంగాణ ప్రభుత్వ యోచన. నిర్మాణానికి అవసరమైన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సుమారు 500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల విస్తరణ పనులు పూర్తి చేశారు. మరో 500 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ 75 కిలోమీటర్ల పనులు పూర్తి చేసింది. ప్రధానంగా యాదగిరిగుట్ట- వరంగల్ మార్గాన్ని నాలుగు లైన్లుగా విస్తరించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 100 కిలోమీటర్ల మేర పనులు జరుగుతుండగా మరో 460 కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది. రానున్న మూడేళ్లల్లో మరో మరో 1,500 కిలోమీటర్ల మార్గాలను పూర్తి చేయాలన్న వ్యూహంతో ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర రహదారులు- భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి 'ఈనాడు'తో చెప్పారు.

## ఐదో స్థానానికి

తెలంగాణ ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో 2,527 కిలోమీటర్ల జాతీయ రహదారులున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో 2,915 కి.మీ. జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం అనుమతిచ్చింది. దేశవ్యాప్తంగా చూస్తే ప్రతి 100 చదరపు కిలోమీటర్లకు 2.84 కి.మీ. జాతీయ రహదారులున్నాయి. ప్రస్తుతం మంజూరైనవన్నీ పూర్తయితే రాష్ట్రంలో జాతీయ రహదారి సగటు 4.62 కిలోమీటర్లకు పెరుగుతుందని అంచనా. దేశంలో 8,483 కిలోమీటర్ల జాతీయ రహదారులతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుత విస్తరణలన్నీ పూర్తయితే జాతీయ రహదారుల విస్తీర్ణంలో తెలంగాణ దేశంలో ఐదో స్థానానికి చేరుకోనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత రెండో స్థానం తెలంగాణదే అవుతుంది.

## నూతన చట్టం ప్రకారమే భూసేకరణ

జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ పెద్ద చిక్కుముడి. ఇటీవల వరకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టేవారు. ఇందుకు సుమారు ఏడాదిన్నర వరకు పట్టేది. జాప్యాన్ని నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం 123 జీవో ప్రకారం భూసేకరణ చేపడతామని కేంద్రం నుంచి అనుమతి తీసుకుంది. ఆ జీవో వ్యవహారం వివాదాస్పదం కావటంతో దాన్ని నిలిపివేశారు. పార్లమెంటు ఆమోదం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చట్టం- 2017ను ఇటీవల అమలులోకి తీసుకువచ్చింది. దీనిప్రకారం భూ యజమానులతో సంప్రదింపుల ద్వారా భూమిని సేకరిస్తారు. కాబట్టి యజమానులకు అధిక మొత్తంలో పరిహారం అందటంతోపాటు త్వరితగతిన భూసేకరణకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో రహదారుల విస్తరణకు ఎంత భూమి సేకరించాలన్నదానిపై కన్సల్టెంట్లు కసరత్తు చేస్తున్నారు. జాతీయ రహదారుల సంస్థ చేపట్టేవన్నీ రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాల్సిన మార్గాలే. ఇందుకోసం భారీగా భూమి సేకరించాల్సినందున దశల వారీగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారుల విస్తరణలో కీలకమైన భూసేకరణ క్రతువును పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది.

### దేశానికి ఆదర్శంగా నిలుపుతాం

జాతీయ రహదారుల విస్తరణలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రణాళిక రూపొందించాం. గడువులోగా నాణ్యతతో నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. నూతన చట్టం ప్రకారం భూసేకరణ చేయనున్నందున జాప్యం బాగా తగ్గుతుంది. కేంద్రం వద్ద మరో ఐదారు వేల కోట్ల రూపాయల విలువైన రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా మంజూరవుతాయన్న ఆశాభావంతో ఉన్నాం.

*– తుమ్మల నాగేశ్వరరావు, రహదారులు- భవనాల శాఖ మంత్రి*

## నాలుగు మార్గాలు.. రూ. 8వేల కోట్లు

గతేడాది హైదరాబాద్‌లో జరిగిన జాతీయ రహదారి కాంగ్రెస్ (ఇండియన్ రోడ్ కాంగ్రెస్) సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రూ.8 వేల కోట్ల వ్యయంతో 460 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపారు. సంగారెడ్డి- నాందేడ్- అకోల మార్గాన్ని 150 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు రూ.2,300 కోట్లు ప్రకటించారు. జగిత్యాల- కరీంనగర్- వరంగల్ మార్గంలో 130 కిలోమీటర్ల విస్తరణకు రూ.2,500 కోట్లు, మంచిర్యాల- చంద్రాపూర్ మార్గంలో 90 కిలోమీటర్లకు రూ.1,500 కోట్లు, సూర్యాపేట- ఖమ్మం మార్గంలో 60 కిలోమీటర్లకు రూ.1,000 కోట్లు, కోదాడ- ఖమ్మం మార్గంలో 40 కిలోమీటర్ల విస్తరణకు రూ.700 కోట్లు మంజూరు చేస్తున్నట్లు గడ్కరీ ప్రకటించారు.

### జాతీయ రహదారులుగా మారే మార్గాలివే..

**21 మార్గాల్లోని 2,915 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు కేంద్రం పచ్చజండా ఊపింది.**

| వరుస సంఖ్య | మార్గం | దూరం (కిలోమీటర్లలో) |
|---|---|---|
| 1. | సారపాక- ఏటూరునాగారం- కాళేశ్వరం- చెన్నూరు- కౌటాల- సిర్పూర్ | 396 |
| 2. | హైదరాబాద్- మెదక్- రుద్రూరు- బోధన్- బాసర- భైంసా | 248 |
| 3. | హైదరాబాద్- ఓఆర్ఆర్- ఘట్‌కేసర్- ఎదులాబాద్- వలిగొండ- తొర్రూరు- నెల్లికుదురు- మహబూబాబాద్- ఇల్లందు- కొత్తగూడెం | 234 |
| 4. | కోదాడ- మిర్యాలగూడ- దేవరకొండ- కల్వకుర్తి- జడ్చర్ల | 211 |
| 5. | చౌటుప్పల్- ఇబ్రహీంపట్నం- ఆమనగల్- షాద్‌నగర్- చేవెళ్ల- శంకరపల్లి- కంది | 186 |
| 6. | సిరిసిల్ల- సిద్దిపేట- జనగాం- అర్వపల్లి- సూర్యాపేట | 184 |
| 7. | సూర్యాపేట- ఖమ్మం- అశ్వారావుపేట- రాజమండ్రి (ఆంధ్రప్రదేశ్) | 177 |
| 8. | కరీంనగర్- సిరిసిల్ల- కామారెడ్డి- ఎల్లారెడ్డి- పిట్లం | 165 |
| 9. | సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్- గజ్వేల్- జగదేవ్‌పూర్- భువనగిరి- చౌటుప్పల్ | 152 |
| 10. | హైదరాబాద్- మొయినాబాద్- చేవెళ్ల- మన్నెగూడ- కొడంగల్- కర్ణాటక సరిహద్దు వరకు | 135 |
| 11. | మెదక్- సిద్దిపేట- ఎల్కతుర్తి | 133 |
| 12. | వరంగల్- ఖమ్మం | 120 |
| 13. | తాండూర్- కొడంగల్- మహబూబ్‌నగర్ | 96 |
| 14. | నిర్మల్- మామడ- ఖానాపూర్- మల్లాపురం- రాయికల్ | 90 |
| 15. | మంచిర్యాల- చంద్రాపూర్ (మహారాష్ట్ర) వయా ఆసిఫాబాద్- రెబ్బన | 90 |
| 16. | మద్దనూరు- బోధన్- నిజామాబాద్ | 76 |
| 17. | భద్రాచలం- జీలుగుమిల్లి- జంగారెడ్డిగూడెం- దేవరపల్లి | 68 |
| 18. | నిజాంపేట- నారాయణఖేడ్- బీదర్ | 60 |
| 19. | ఆదిలాబాద్- బేల | 43 |
| 20. | మిర్యాలగూడ- పిడుగురాళ్ల- నరసరావుపేట (ఆంధ్రప్రదేశ్) | 26 |
| 21. | జహీరాబాద్- బీదర్- డెగ్లూర్ | 25 |